

## ఎలాన్ మస్క్‌కు ఆహ్వానం!

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫాంటసీ సైన్స్‌ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898ఏడీ' జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ వాడిన కారు 'బుజ్జి' అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. కొద్ది రోజుల క్రితం జరిగిన భారీ ఈవెంట్‌లో ఈ కారును పరిచయం చేశారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ కారు వివిధ నగరాల్లో సందడి చేస్తున్నది. తాజాగా చెన్నై రోడ్లపై ఈ కారు విహరిస్తున్న ఫొటోలపై దర్శకుడు నాగ్అశ్విన్ స్పందించారు. తన ట్విట్టర్ ఖాతాలో ఈ ఫొటోలను పోస్ట్ చేసిన ఆయన 'బుజ్జి' వాహనాన్ని నడపాలంటూ టెస్లా కంపెనీ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను కోరారు. 'డియర్ ఎలాన్ మస్క్ సర్..మీరు భారత్‌కు వచ్చి మా బుజ్జిని నడపాలని కోరుకుంటున్నాం. ఇదొక ఇంజనీరింగ్ అద్భుతం. పూర్తిగా ఎలక్ట్రిక్ కారు. ఇండియాలోనే తయారు చేశాం. దీని బరువు ఆరు టన్నులు. మీ కంపెనీ టెస్లా తయారు చేసిన సైబర్‌ట్రక్, బుజ్జి కలిసి ప్రయాణం చేస్తే చూడముచ్చటగా ఉంటుంది' అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఒకవేళ దీనిపై ఎలాన్ మస్క్ స్పందిస్తే 'కల్కి' చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో కావాల్సినంత ప్రచారం జరుగుతుందని అభిమానులు అనుకుంటున్నారు. 'కల్కి 2898' చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్, దిశాపటానీ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

## నా కెరీర్‌లో ప్రత్యేకం



''గం గం గణేశా' నా కెరీర్‌లో సరికొత్త ప్రయత్నం. ఈ సినిమాలో నేను పక్కింటి అబ్బాయిలా కనిపించను. హైపర్ ఎనర్జీతో నా క్యారెక్టర్ సాగుతుంది. క్రైమ్ కామెడీ కథాంశంతో ఆకట్టుకుంటుంది' అన్నారు ఆనంద్ దేవరకొండ. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఉదయ్‌శెట్టి దర్శకుడు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం ఆనంద్ దేవరకొండ పాత్రికేయులతో పంచుకున్న సంగతులు..

- వినాయకుడి విగ్రహం చుట్టూ నడిచే కథ ఇది. ఆ విగ్రహాన్ని దక్కించుకోవడం కోసం కొందరు ప్రయత్నాలు చేస్తుంటారు. అసలు ఆ విగ్రహంలో ఏముంది? చివరకు అది ఎవరికి దక్కింది? అనే విషయాలు ఈ కథలో ఆసక్తినిరేకెత్తిస్తాయి. భయం, అత్యాశ, కుట్ర అనే మూడు అంశాల చుట్టూ నడిచే ఈ కథ ఆద్యంతం ఉత్కంఠను, వినోదాన్ని పంచుతుంది

- లాక్‌డౌన్ టైమ్‌లో దర్శకుడు ఉదయ్‌శెట్టి ఈ కథ చెప్పాడు. అనివార్య కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్ ఆలస్యమవుతూ వచ్చింది. చాలా మంది నన్ను హీరో సెంట్రిక్ మూవీస్ ఎందుకు చేయడం లేదని అడుగుతుంటారు. ఈ సినిమాతో కొంత వరకు ఆ ప్రయత్నం నెరవేరింది. ఇందులో నా పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా అనిపిస్తుంది.

- ఏ హీరోకైనా స్పాన్ ఒక్కసారిగా పెరిగేది కాదు. 'బేబీ' వంద కోట్లు వసూలు చేసిందని నా తదుపరి చిత్రానికి ఇంకా ఎక్కువ కలెక్షన్స్ రావాలని అనుకోను. ఎందుకంటే 'బేబీ' యూనివర్సల్ లవ్ సబ్జెక్ట్ కాబట్టి ఆ స్థాయిలో వసూళ్లు సాధించింది. 'గం గం గణేశా' క్రైమ్ కామెడీ జోనర్. అందుకే రెండు చిత్రాలను పోల్చి చూడటం లేదు.

- రష్మిక మందన్న మా ఫ్యామిలీ ఫ్రెండ్. ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో చిట్‌చాట్ వైరల్ కావాలనే చేశాం. నాకు పక్కా మాస్ యాక్షన్ మూవీస్ అంటే చాలా ఇష్టం. త్వరలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలో అలాంటి కథతో సినిమా చేయబోతున్నా. వినోద్ దర్శకుడు. 'బేబీ' డైరెక్టర్ సాయిరాజేష్, నిర్మాత ఎస్కేఎన్ కాంబినేషన్‌లో ఓ సినిమా చేయబోతున్నా. స్టూడియో గ్రీన్ వారి 'డ్యూయట్' సినిమాలో నటిస్తున్నా.

## మెత్తానీ పత్తిపువ్వులాంటోడు
# నా సామి..



'పుష్ప-2' (ది రూల్) చిత్రం కోసం దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. బుధవారం ఈ చిత్రం నుంచి 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన ఈ పాట ప్రోమో సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ పాటకు దేవిశ్రీప్రసాద్ స్వరాలను సమకూర్చగా చంద్రబోస్ రచన చేశారు. పుష్పరాజ్ మీద శ్రీవల్లి మనసులోని ప్రేమను, ఆరాధనా భావాన్ని వ్యక్తం చేస్తూ చక్కటి సాహిత్యంతో ఈ పాట ఆకట్టుకుంటున్నది. 'వీడు మొరటోడు అని వాళ్లు వీళ్లు..ఎన్నెన్ని అన్న పసిపిల్లవాడు నా వాడు..వీడు మొండోడు అని ఊరువాడ అనుకున్నాగానీ మహరాజు నాకు నా వాడు..ఓ మాట పెలుసైనా..మనసు వెన్న..రా యిలా ఉన్నవాడిలోన దేవుడెవరికి తెలుసు నా కన్నా.. సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉం టాడే నా సామీ..మెత్తానీ పత్తిపువ్వులా మరి సంటోడే నా సా మీ' అంటూ అద్భుతమైన భావాలతో ఈ పాట సాగింది. ఐదు భాషల్లో శ్రేయా ఘోషల్ ఆలపించింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## చెంగల్వ చేయందేనా..

కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'భారతీయుడు-2'. 1996లో సంచలనం సృష్టించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్ ఇది. జూలై 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. జూన్ 1న చెన్నైలో ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలుపెట్టారు. బుధవారం రెండో సింగిల్ 'చెంగల్వ చేయందేనా..' అనే పాటను విడుదల చేశారు. అనిరుధ్ రవిచందర్ సంగీత సారథ్యంలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ గీతాన్ని అబ్బి, శృతికా సముద్రాల ఆలపించారు. సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్‌లపై చిత్రీకరించిన ఈ పాట చక్కటి మెలోడీగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సీక్వెల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ కనిపించనున్నారు. ఎస్.జె.సూర్య, సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీశంకర్, నెడుముడి వేణు, వివేక్, కాళిదాస్, జయరాం, గుల్షన్ గ్రోవర్, సముద్రఖని, బాబీ సింహా, బ్రహ్మానందం, జాకీర్ హుస్సేన్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమెరా: రవివర్మన్, ఎడిటింగ్: ఎ.శ్రీకర్‌ప్రసాద్. నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ ప్రొడక్షన్స్.



## అరుదైన గౌరవం

బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్ ఇండస్ట్రీలో రాణిస్తూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకుంది అగ్ర కథానాయిక దీపికా పడుకోన్. 'ఓం శాంతి ఓం' చిత్రంతో హిందీలోకి అరంగేట్రం చేసిన ఈ భామ అక్కడ అనేక హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుంది. హాలీవుడ్ సినిమాలతో అంతర్జాతీయంగా పేరు తెచ్చుకుంది. తాజాగా ఈ మంగళూరు సోయగం అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. అంతర్జాతీయంగా పేరొందిన ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎమ్‌డీబీ గత దశాబ్దకాలంలో విశేష ప్రజాదరణ పొందిన భారతీయ నటీనటుల జాబితాను విడుదల చేసింది. ఇందులో దీపికా పడుకోన్ తొలిస్థానంలో నిలిచింది. సమంత 13న స్థానంలో ఉంది. 'టాప్ 100 మోస్ట్ వ్యూవ్డ్ ఇండియన్ స్టార్స్' పేరుతో గత పదేళ్ల కాలంలో పాపులర్ అయిన సినీ తారల జాబితాను ఐఎండీబీ విడుదల చేసింది. ఇందులో అనేక మంది అగ్ర తారలను అధిగమించి దీపికా పడుకోన్ నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఈ గుర్తింపు తనకు ఎంతో ప్రత్యేకమైనదని, ప్రపంచవ్యాప్తంగా ఇంతమంది ప్రేమను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందని దీపికా పడుకోన్ ఆనందం వ్యక్తం చేసింది.



## ముంబయి నేపథ్య ప్రేమకథ

దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 1980-90 దశకం నడుమ జరిగే పీరియాడిక్ డ్రామా ఇది. ముంబయి నేపథ్యంలో హృద్యమైన ప్రేమకథగా మెప్పిస్తుంది. ఓ సాధారణ వ్యక్తి యొక్క అసాధారణ ప్రయాణానికి దృశ్యరూపంగా ఉంటుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, రచన-దర్శకత్వం: వెంకీ అట్లూరి.

## ఆ విషయంలో బాధపడలేదు!



కెరీర్ ఆరంభం నుంచి వినూత్న కథాంశాలతో సినిమాలు చేస్తున్నారు హీరో కార్తికేయ. ఆయన తాజా చిత్రం 'భజే వాయువేగం' ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రశాంత్ రెడ్డి దర్శకుడు. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించింది. బుధవారం హీరో కార్తికేయ పాత్రికేయులతో మాట్లాడుతూ 'దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు అందులోని ఎమోషన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యాను. హీరోగా నాకు సామాజిక బాధ్యత ఉండాలని భావిస్తాను. ఆ కోణంలో ఈ సినిమా ఇన్‌స్పైరింగ్‌గా ఉంటు ంది. ఓ యువకుడు ఓ ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించే ప్రయత్నాలు ఏమిటన్నదే ఈ చిత్ర కథ. హీరోయిజం, యాక్షన్, సెంటిమెంట్, లవ్ అన్ని అంశాలుంటాయి' అన్నారు. హీరోగా రాణిస్తున్న సమయంలో గ్యాంగ్‌లీడర్, వాలిమై చిత్రాల్లో విలన్ పాత్రలు చేయడంపై కార్తికేయ స్పందించారు. 'ఈ విషయంలో నేను ఏరోజు బాధపడలేదు. 'గ్యాంగ్‌లీడర్' చిత్రం ద్వారా అమెరికా ఆడియెన్స్‌కు కూడా చేరువయ్యాను. అజిత్‌తో చేసిన 'వాలిమై' ద్వారా తమిళంలో గుర్తింపు దక్కింది. ఆ సినిమా తర్వాతే నేను స్టైలిష్ మేకోవర్‌తో సినిమాలు చేయడం మొదలుపెట్టా. 'భజే వాయువేగం' దర్శకుడు ప్రశాంత్ రెడ్డితో మరో చిత్రాన్ని చేసే ఆలోచన ఉంది' అన్నారు.

## గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు



'గోదావరి ప్రాంతం అనగానే అందమైన కొబ్బరి చెట్లు, ప్రకృతి దృశ్యాలను చూపిస్తూ అంతా ప్రశాంతంగా ఉందనే భావన కలిగిస్తారు. అయితే అక్కడ కూడా నేరాలు జరుగుతాయి. ఆ ఆలోచన నుంచి పుట్టిందే ఈ కథ. అందరూ అనుకుంటున్నట్లుగా ఇది గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు' అన్నారు కృష్ణచైతన్య. ఆయన దర్శకత్వంలో విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం కృష్ణచైతన్య పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'త్రివిక్రమ్‌గారి సూచనతోనే విశ్వక్‌సేన్‌కు ఈ కథ చెప్పాను. మహాభారతంలో 'నా అనేవాడే నీ మొదటి శత్రువు' అనే మాట నాకు చాలా ఇష్టం. ఆ లైన్ ఆధారంగానే ఈ కథ నడుస్తుంది. ఓ ప్రాంతంలోని నాలుగు గ్యాంగుల మధ్య నడిచే పోరు, ఎత్తుకుపై ఎత్తులు ఏమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుంది. పతాక సన్నివేశాలు హృదయానికి హత్తుకుంటాయి. ఈ సినిమాకు యు.ఏ.సర్టిఫికెట్ వచ్చింది. కుటుంబమంతా కలిసి చూడొచ్చు. ట్రైలర్‌లో సెన్సార్ అభ్యంతరాలు ఉండవు కాబట్టి కొన్ని మాటల్ని ఉంచాం. వాటిని సినిమాలో మ్యూట్ చేశాం. యువన్‌శంకర్ రాజా సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. తనకు పవన్‌కల్యాణ్ అంటే ఎప్పటి ఎంతో అభిమానమని, ఆయనతో సినిమా చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నానని కృష్ణచైతన్య పేర్కొన్నారు.



## అందరూ మెచ్చే పరాక్రమం

బండి సరోజ్‌కుమార్ స్వీయదర్శకత్వంలో నిర్మించి, నటించిన చిత్రం 'పరాక్రమం'. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిపారు. విశ్వక్‌సేన్, దర్శకులు బుచ్చిబాబు సాన, జ్ఞానసాగర్ ద్వారక, నిర్మాత ఎస్.కె.ఎన్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. ఓ యజ్ఞంలా ఈ సినిమా చేశామని, అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా ఈ 'పరాక్రమం' ఉంటుందని దర్శక, నిర్మాత, హీరో బండి సరోజ్‌కుమార్ తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్‌సభ్యులందందరూ మాట్లాడారు. శృతి సమన్వి, నాగలక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోవు, అనిల్‌కుమార్ ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆర్.ప్రసాద్, నిర్మాణం: బి.ఎస్.కె.మెయిన్‌స్ట్రీమ్.





